ఓబుళాపురంలో...

# అసైన్డ్ భూముల ఆక్రమణ!




- ఓఎంసీ, బీఐఓపీ చెరలో 375.41 ఎకరాలు
- ఏపీఐఐసీ సేకరించిన భూముల స్వాధీనం నిలిపివేత
- ప్రభుత్వ ఉత్తర్వులు

**అనంతపురం, డి.హీరేహాళ్- న్యూస్‌టుడే:** ఓబుళాపురం 'ఘనుల' అక్రమార్కులపై ప్రభుత్వం పట్టు బిగిస్తోంది. మైనింగ్ కంపెనీలు అక్రమంగా వినియోగించుకుంటున్న భూములతో పాటు వారికోసమే ఏపీఐఐసీ సేకరించినభూములపైనా దృష్టి పెట్టింది. ఇప్పటిదాకా లీజు పొందిన కంపెనీల అధీనంలో ఉన్న 375.41 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోడానికి సిద్ధమైంది. ఇందులో ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ) చేతిలోనే 304 ఎకరాలు ఉండగా.. మరో 70 ఎకరాలు బళ్లారి ఐరన్‌ఓర్ ప్రైవేట్(బీఐఓపీ) లిమిటెడ్ అధీనంలో ఉన్నాయి. ఏయే సర్వే నంబర్లలో ఎంత అసైన్డ్ భూమిని దుర్వినియోగం చేశారో నివేదిక పంపాలని ప్రభుత్వం అనంతపురం జిల్లా యంత్రాగాన్ని ఆదేశించింది.

ఓబుళాపురంలో ప్రభుత్వానికి చెందిన 13.7 ఎకరాలను ఓఎంసీ, 20.06 ఎకరాలను బీఐఓపీలు ఆక్రమించాయి. ఓఎంసీ అందులో రైల్వే లైన్లను, డంపులను ఇతర నిర్మాణాలను చేపట్టింది. బీఐఓపీ తన ఆక్రమిత స్థలంలో మొక్కలను నాటినట్లు అధికారులు నిర్ధరించారు. అవి కాకుండా.. 50 ఏళ్ల క్రితం షెడ్యూల్డ్ కులాలు, వెనకబడిన తరగతులకుపంపిణీ చేసిన 341.65 ఎకరాల భూములను కూడా మైనింగ్ సంస్థలు గుంజుకున్నట్లు వెల్లడైంది. అందులో ఓఎంసీ ఆక్రమిత భూమి 290.96 ఎకరాలు కాగా.. బీఐఓపీది 50.69 ఎకరాలు. నిరుపేదలైన రైతుల నుంచి ఓఎంసీ ఆభూములను బలవంతంగా లాక్కుంది. అసైన్డ్ భూములను కొనుగోలు చేయకూడదని నిబంధనలు చెబుతున్నా ఎకరాకు రూ.25 వేలు చొప్పున విదిలించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

## ఏపీఐఐసీని అడ్డు పెట్టుకుని..

అసైన్డ్ భూములను మైనింగ్ కంపెనీలకు అధికారికంగా దఖలు పరిచేందుకు వైఎస్ ప్రభుత్వం కూడా సహకారాన్ని అందించింది. పారిశ్రామిక అవసరాలకు తమ సమీపంలో ఉన్న భూముల్ని కేటాయించాలంటూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(ఏపీఐఐసీ)కి లీజు కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. అడిగిందే తడవుగా 2008 నవంబరు నుంచి ఏపీఐసీసీ దస్త్రాలను వేగంగా కదిలించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో భూసేకరణకు ఆదేశాలు జారీ అయ్యాయి. రైతులకు పరిహారం కింద ఎకరాకు రూ.1.25 లక్షలు చొప్పున చెల్లించారు. 290.96 ఎకరాల భూముల కోసం ఓఎంసీ రూ.3.63 కోట్లు సర్కారుకు చెల్లించింది. బీఐఓపీ 50.69 ఎకరాల భూమి కోసం 63.36 లక్షలను ప్రభుత్వానికి జమ చేసింది. ఈ ఏడాది జూన్‌నాటికి రైతులకు పరిహారం కూడా చెల్లించేశారు.

## అప్పగింతపై ఆంక్షలు..

భూములను తొలుత జిల్లా యంత్రాంగం ఏపీఐఐసీకి కేటాయిస్తుంది. అనంతరం వాటిని ఉద్దేశించిన సంస్థలకు ఏపీఐఐసీ అప్పగిస్తుంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో భూముల అప్పగింతను వెంటనే నిలిపేయాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. భూముల ప్రస్తుత పరిస్థితిపై తక్షణ నివేదిక ఇవ్వాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసింది. గత మూడు రోజులుగా రెవెన్యూ యంత్రాంగం దీనిపై ఉరుకులు పరుగులు పెడుతోంది. సర్వే నంబర్ల వారీగా భూముల పరిస్థితిని విచారిస్తోంది.

## నేడు నివేదిక: తహసీల్దార్

'మైనింగ్ సంస్థల కోసం ఏపీఐఐసీ ద్వారా సేకరించిన భూములను ఆయా సంస్థలకు బదలాయింపును నిలిపేశాం. గతంలో వీటిని వాహనాల కోసం, సరకు నిల్వ చేసుకోడానికి ఇతరత్రా ఉపయోగించుకునేవారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ భూముల్లో మైనింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలేవీ జరగకుండా చర్యలు తీసుకుంటాం. మొత్తం భూములన్నింటినీ మా అధీనంలోకి తీసుకుంటాం' అని డి.హీరేహాళ్ తహసీల్దార్ శంకరయ్య పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రానికి దీనిపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని చెప్పారు.